e ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దినపత్రిక


విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్: 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

సంపుటి : 1 సంచిక : 55 | 05-08-2025 | ఎడిటర్: యం నాగేశ్వరరావు | పేజీలు : 8 | వెల 2/-

# పాలనలో పీపుల్-విజన్-నేచర్

## -టెక్నాలజీకి ప్రాధాన్యమిస్తే అత్యుత్తమ ఫలితాలు: సీఎం చంద్రబాబు



- పాలనలో విజన్, ప్రజలు, ప్రకృతి, మరియు సాంకేతికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, దీని వల్ల అత్యుత్తమ ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు.
- ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు కల్పించడం లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలి.
- పథకాలు మరియు కార్యక్రమాలను రూపొందించేటప్పుడు కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించాలి.
- తలసరి ఆదాయం లక్ష్యాలు: 2025-26 ఆర్థిక సంవత్సరానికి తలసరి ఆదాయం రూ. 3,47,871 సాధించాలని, 2029 నాటికి రూ. 5.42 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- ఒక పరిశ్రమ నుండి వచ్చే వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడిసరుకుగా ఉపయోగపడేలా వృత్తాకార ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ)కి శ్రీకారం చుట్టాలని సూచించారు.

**గాయత్రి వార్తలు** విజన్, పీపుల్, నేచర్, టెక్నాలజీలకు ప్రాధాన్యమిస్తూ చేసే పాలనతో అత్యుత్తమ ఫలితాలు వస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. నాణ్యమైన జీవన ప్రమాణాలను సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, అభివృద్ధి సూచికలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఆర్థికాభివృద్ధితో పాటు రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యమని సీఎం అన్నారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలని.. కనీస అవసరాలు అందించాలని దిశానిర్దేశం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తలసరి ఆదాయం రూ.3,47,871 సాధించాలని, దానికి అనుగుణంగా 2029 నాటికి రూ. 5.42 లక్షలు తలసరి ఆదాయం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. స్వల్ప, మధ్య, దీర్ఘ కాలిక లక్ష్యాలకు అనుగుణంగా విజన్ ఉండాలన్నారు. పథకాలతో పాటు వారి ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఒక పరిశ్రమలో తయారైన వేస్ట్ మరో పరిశ్రమకు ముడి సరకు అయ్యేలా సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలని చంద్రబాబు సూచించారు. అత్యుత్తమ సాంకేతికతను పాలనకు అనుసంధానించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఉత్పత్తులకు విలువ జోడింపు కీలకమన్న సీఎం.. దాని ద్వారానే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మైనింగ్, వ్యవసాయ ఉత్పత్తుల్లో జీవీఏ ప్రధాన అంశమన్నారు. జీఎస్డీపీ వృద్ధి చెందితేనే ప్రజలకు మరింత సంక్షేమం, అభివృద్ధి అందించగలమని చెప్పారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రంగా ఏపీ తయారు కావాలని సీఎం ఆకాంక్షించారు.



## కేంద్రమంత్రి పెమ్మసాని పోస్ట్

# ఈ అమూల్యమైన క్షణాలు మరువలేనివి..

- కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు.
- ప్రధాని మోదీ తమకు సమయం కేటాయించినందుకు పెమ్మసాని మరియు ఆయన కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.
- మోదీ నాయకత్వం, అంకితభావం, వినయశీలత తమను ఎంతగానో ప్రభావితం చేశాయని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.
- ఈ క్షణాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఆయన తెలిపారు.

**గాయత్రి వార్తలు**: కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన కుటుంబసభ్యులతో వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ ని కలిశారు. ఈ అమూల్యమైన క్షణాలు మరువలేనివని పెమ్మసాని పేర్కొన్నారు. ఈ మేరకు తన కుటుంబంతో ప్రధానిని కలిసిన ఫొటోలను సోషల్ మీడియాలో ఆయన పోస్ట్ చేశారు. "ఈరోజు ప్రధాని నరేంద్రమోదీని కుటుంబసభ్యులతోపాటు మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం లభించింది. ఈ అమూల్యమైన క్షణాలు మరువలేనివి. ప్రధాని తన విలువైన సమయాన్ని కేటాయించినందుకు మా కుటుంబం తరఫున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మోదీ దూరదృష్టి గల నాయకత్వం, అంకితభావం, వినయ శీలతతో కూడిన వ్యక్తిత్వం మమ్మల్ని ఎంతో ప్రభావితం చేసింది. ఈ క్షణాలు మాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి" అని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్ ప్రమాణం



**గాయత్రి వార్తలు** ఏపీ హైకోర్టు అదనపు జడ్జిగా జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణస్వీకారం చేయించారు.

# మందు బాబులకు గుడ్ న్యూస్



**గాయత్రి వార్తలు** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. గీత కార్మిక వర్గాలకు 10 శాతం షాపులు కేటాయించాలని నిర్ణయించారు. అమరావతి, ఆగస్ట్ 04: రాష్ట్రంలో మద్యం పాలసీ గడువు మరి కొద్ది రోజుల్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త మద్యం విధానాన్ని అమలు చేయాలని చంద్రబాబు సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా కొత్త మద్యం విధానాన్ని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రి వర్గ ఉప సంఘం నివేదిక ఆధారంగా ఈ కొత్త మద్యం విధానాన్ని అమలు చేయనుంది. మద్యం పాలసీ అంటే ఆదాయం కాదు.. ప్రజల ఆరోగ్యం ముఖ్యమనే విధంగా ఏపీ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. దీంతో అల్కాహాల్ కంటెంట్ తక్కువ ఉండే మద్యం విక్రయాలతో నష్టం తగ్గించ వచ్చునని భావిస్తుంది. అంటే.. మద్యం కారణంగా పేదల ఇళ్లు, ఒళ్లు గుల్లా కాకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ క్రమంలో బార్లలో కూడా గీత కార్మిక వర్గాలకు 10 శాతం షాపులు కేటాయించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ప్రభుత్వ వైద్యులకు రిజర్వేషన్లు.. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. 7 క్లినికల్ సబ్జెక్టుల్లో 15 శాతం, నాన్ క్లినికల్ సబ్జెక్టుల్లో 30 శాతం రిజర్వేషన్ వారికి కల్పించాలని నిర్ణయించారు. అయితే స్పెషలిస్టుల అవసరాలతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల ఆకాంక్షల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిజర్వేషన్లు కల్పించాలంటూ వైద్యారోగ్య శాఖ ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారు.

## రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



**గాయత్రి వార్తలు** : ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తామని ఏపీ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. 'శ్రీ శక్తి' పేరుతో ఈ పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు."మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం సమర్థంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయొచ్చు. మహిళలు తమ ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డుల్లో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది. 6,700 బస్సుల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. దీనికోసం రూ.1,950 కోట్ల వ్యయం అవుతుంది. 3వేల విద్యుత్ బస్సుల కొనుగోలుకు సీఎం ఆదేశించారు. రానున్న రెండేళ్లలో 1,400 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేస్తాం" అని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

## స్కూటీని ఢీకొట్టిన లారీ.. ముగ్గురు యువకుల మృతి




## ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు.. ఉత్కంఠ పోరులో భారత్‌దే విజయం

- ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో టీమ్ఇండియా సంచలన విజయం సాధించింది.
- 374 పరుగుల లక్ష్యఛేదనలో హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) శతకాలు బాదడంతో ఇంగ్లాండ్ ఒకదశలో 301/3తో పటిష్ఠ స్థితిలో నిలిచింది.



# రఘురామపై పెట్టిన కేసును కొనసాగించలేను..

## సుప్రీంకోర్టుకు తెలిపిన ఫిర్యాదుదారు



**గాయత్రి వార్తలు** ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుపై పెట్టిన కేసును ఇక కొనసాగించలేనని ఫిర్యాదుదారు ఫరూక్ బాషా సుప్రీంకోర్టుకు తెలిపారు. కేసును కొనసాగించేందుకు ఆయన సిద్ధంగా లేనట్లు సమాచారం పంపారని ఫరూక్ తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది.

# కన్నుల పండుగగా మార్కెట్ యార్డ్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

**– రాష్ట్ర మంత్రులు, జిల్లా ఎమ్మెల్యేల సమక్షంలో గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం.**



**గాయత్రి వార్తలు**

గిద్దలూరు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో "గిద్దలూరు, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్" ల ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు..

గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగని విధంగా వేలాదిమంది కూటమి శ్రేణుల కేరింతలతో, కన్నుల పండుగగా నిర్వహించిన ఈ ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ , రాష్ట్ర సంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి మరియు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఎమ్.ఎమ్ కొండయ్య, యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ ఎరిక్షన్ బాబు, దర్శి టీడీపీ నాయకులు కడియాల లలిత్ సాగర్, రాష్ట్ర మారీటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ చైర్మన్ నూకసాని బాలాజీ గార్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మొదటగా ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్ర గేయంతో సభను ప్రారంభించారు.గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా బైలడుగు బాలయ్య యాదవ్, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ గా పూనూరు భూపాల్ రెడ్డి గార్లు, మరియు వైస్ చైర్మన్లు, డైరెక్టర్లతో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిని ఓర్చుకోలేక వైసిపి నాయకులు బాబు షూరిటీ మోసం గ్యారెంటీ అంటూ కార్యక్రమాలు చేసుకుంటూ తిరుగుతున్నారని, పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తే ఈ ప్రాంత రెడ్లు ఇంకా జగన్ జపం చేయటం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే నారాయణరెడ్డి తీవ్రంగా విమర్శించారు. కులం ఒక పూటకూడా అన్నం పెట్టదని, నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి అశోక్ రెడ్డి అని అన్నారు. మార్కాపురం జిల్లాగా సాధిస్తామని పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీరు అందిస్తామన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ నాసిరకం మద్యాన్ని విక్రయించి ప్రజల ఆరోగ్యాలతో వైసిపి చలగాటం ఆడుకున్నదని, మద్యం కుంభకోణంతో కట్టలు కట్టలుగా డబ్బులు దొరుకుతున్నాయని అన్నారు. మద్యం కుంభకోణంలో సూత్రదారులు, పాత్రదారులు చట్టం నుండి తప్పించుకోలేరన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపించేందుకు నూతన విద్యుత్ సబ్ స్టేషన్ లు నిర్మిస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ యార్డ్ చైర్మన్లకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలియచేశారు.. సభ అనంతరం రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, మార్కెట్ యార్డ్ చైర్మన్లకు వేద పండితుల ఆశీర్వచనాలు, ముస్లిం మత పెద్దలు, ఫాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ ఇన్చార్జ్ లు, జడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు, సొసైటీ బ్యాంకు చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ఎన్డీయే కూటమి శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# అన్నదాతలను ఆదుకోవాలి



**గాయత్రి వార్తలు**

రైతులను ఆదుకోవాలని నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్ప కిషోర్ రెడ్డి డిమాండ్ చేశారు తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మాజీ మార్కెఫెడ్ చైర్మన్ పి పి నాగి రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నదాలపై నిర్లక్ష్యం వహిస్తున్నాడని, ఖరీఫ్ సీజన్ లో పంటల సాగుకు సిద్ధం అయిన రైతన్నలకు సంవృద్ధిగా సాగునీరు అందించలేకపోతున్నారని, అలాగే ఎరువులను సరిపడా పంపిణీ చేయలేక రైతన్నలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే కష్టాలు తీరుస్తాడని గంపెడాశతో ఉన్న రైతులను కష్టాల్లోకి నెట్టాడని గతంలో రైతులపై బుల్లెట్ల వర్షం కురిపించాడని అన్నారు. అన్నదాత సుఖీభవ అంటూ మాటలవరకే పరిమితం అయ్యాడని, అధికారంలోకి వచ్చి సంవత్సరం మూడు నెలలు కావస్తున్నా రైతులు దయనీయ పరిస్థితిలో ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు, నష్టాలు, క్షామం తాండవిస్తోందని విమర్శించారు. సకాలంలో వర్షాలు కురిసినా ఎరువుల లభ్యత ఉన్నాకూడా రైతులకు యూరియా పంపిణీ అరకొరగా అందిస్తు రైతన్నలను కన్నీరు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ అందిస్తాం







**– మేడవారిపల్లె సబ్ స్టేషన్ ప్రారంభించిన గొట్టిపాటి**

**గాయత్రి వార్తలు**

రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు సోమవారం అయినా రాచర్ల మండలంలోని మేడవరపల్లి గ్రామంలో సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖాళీ ఖజానా వచ్చినప్పటికీ రాష్ట్రంలో వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా కరెంటును అందిస్తున్నామని తెలిపారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నిరంతరం ప్రజల కోసం చేస్తున్న పనిని గుర్తించి తోడ్పాటున ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ మంత్రి డోల వీరాంజనేయ స్వామి విరకొండ పాలెం ఇంచార్జి ఎరిక్షన్ బాబు, పాఠశాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద సీనియర్ నాయకుడు రాచర్ల సొసైటీ అధ్యక్షుడు జీవనేశ్వర్ రెడ్డి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నమ్మకత్వమే చైర్మన్ చేసింది

**గాయత్రి వార్తలు**



గిద్దలూరు చైర్మన్గా కంభం మార్కెట్ కమిటీ చైర్మన్గా పదవి బాధ్యతలు స్వీకరించిన బైలడుగు బాలయ్య పూనూరు భూపాల్ రెడ్డిలు అశోక్ రెడ్డికి టిడిపికి నమ్మకంగా ఉండడం పార్టీలు మారే ఆలోచన లేకపోవడం ఎన్ని ఒత్తిడి వచ్చిన మొత్తముల వెంట కొనసాగడం వారికి పదవులు వచ్చేలా చేసింది. గిద్దలూరు లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు ఇద్దరు గురించి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో సామాన్య కార్యకర్తలుగా ఉన్న వారు అంచెలంచెలుగా ఎదుగుతూ నియోజకవర్గ స్థాయిలో పదవులు పొందడానికి వారిలో ఉన్న నమ్మకత్తమే కారణమని శాసనసభ్యులు ముత్తుములల అశోక్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీకి అశోక్ రెడ్డికి అండగా ఉంటామని చివరి వరకు తెలుగుదేశం పార్టీని అశోక్ రెడ్డిని విడిచేది లేదని కోనూరు భూపాల్ రెడ్డి బాలయ్యలు ఘంటా పదంగా సమావేశంలో పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రులు





**గాయత్రి వార్తలు**

గిద్దలూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యేలు మరియు ముఖ్య నాయకులతో కలిసి రూ. 2.43 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, మరియు బెస్తవారిపేట పట్టణంలో రూ. 1.83 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్ర గొట్టిపాటి రవికుమార్ మరియు శ్రీ డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి

# సంపాదకీయం

## తెరవని తలుపుల వెనుక దాగిన చీకట్లు





తెలుగు నవల వెలువడిన తొలి రోజుల్లో నవలాకారులు పాత్రల బాహ్య సంఘర్షణకు ఇచ్చిన ప్రాధాన్యతను అంతరంగ సంఘర్షణకు ఇచ్చేవారు కాదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తెలుగు నవలాసాహిత్యంపై పడిన ముఖ్యమైన ప్రభావాల్లో మనో విశ్లేషణవాదం, అస్తిత్వవాద సిద్ధాంతం ముఖ్యమైనవి. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, ముఖ్యంగా అచేతన మనస్సు రిప్రెషన్ లిబిడో, ఒడిపస్ కాంప్లెక్స్ వంటి భావనలు, తెలుగు సాహిత్యంలో కొంతమంది రచయితల రచనల్లో స్పష్టంగా లేదా అంతర్లీనంగా కనిపిస్తాయి. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణవాద దృక్పథంతో రచనలో మనోవిశ్లేషణ చేసిన నవలాకారుల్లో త్రిపురనేని గోపీచంద్ ప్రముఖులు. ఆయన రాసిన 'అసమర్థుని జీవయాత్ర', 'మెరుపుల మరకలు', 'పిల్ల తెమ్మెర', 'గడియ పడని తలుపులు' మొదలైన నవలల్లో మనస్తత్వ విశ్లేషణ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవల, వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల', ఆర్.ఎస్.ఎస్. సుదర్శనం 'సంసార వృక్షం', శీలా వీర్రాజు 'మైనా', భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచిక పుల్లలు', కోడూరు రామమూర్తి 'నీటిలో నీడలు'... మొదలైన నవలలు ఈ కోవలోనివే. చలం రచనలు ముఖ్యంగా 'మైదానం', 'సావిత్రి' వంటివి లైంగిక సంఘర్షణలు, సామాజిక నిషేధాలు, వ్యక్తిగత స్వేచ్ఛ కోసం పోరాటాన్ని చిత్రీకరించాయి. విశ్వనాథ సత్యనారాయణ 'ఏకవీర' నవలలో కూడా ఈ సిద్ధాంతానికు సంబంధించిన అవగాహన కనపడుతుంది. ఇటీవల తెలుగులో వచ్చిన నవలల్లో మనస్తత్వ విశ్లేషణ గురించి ప్రస్తావించేటప్పుడు కాశీభట్ల వేణుగోపాల్ రాసిన 'నేను చీకటి', 'తపన' మొదలైన అన్ని నవలల గురించీ పేర్కొనాలి. ఈ నవలల్లో పాత్రల అంతరంగ సంఘర్షణలను ఆవిష్కరించడం కోసం కాశీభట్ల వేణుగోపాల్ చైతన్యస్రవంతి విధానాన్ని విస్తృతంగా ఉపయోగించారు. 'నేను చీకటి' నవల ఒక మనో వైజ్ఞానిక నవల చేసే పనే గాక సామాజిక స్పృహతో రాసిన నవల చేసే పనిని కూడా సమర్థవంతంగా నిర్వహిస్తుంది. మనిషి మనసులోని చీకటికోణాల ఆవిష్కరణకు చైతన్య స్రవంతి శైలి ఉపయోగపడుతుందని భావించి తాను ఆ శైలిని ఉపయోగిస్తున్నట్లు కాశీభట్ల చెప్పుకొన్నారు. ఆయన 'తెరవని తలుపులు' నవల మనసులోని సంఘర్షణను, తెలియని భయాలను, అణచివేయబడిన ఆలోచనలను, సామాజిక ఒత్తిడుల మధ్య సంఘర్షణలను చిత్రీకరిస్తుంది. 'తెరవని తలుపులు' శీర్షికే మనసులో బంధించబడిన భావాలను, తెరవడానికి ధైర్యం లేని రహస్యాలను సూచిస్తుంది. ఈ నవలలో చైతన్య స్రవంతి శైలి విరివిగా కనిపిస్తుంది. ఈ వాక్యాలను ఒకసారి పరిశీలించండి: "ఫాంటేన్వెడ్... ర్యాండ్... వియ్యలవింగ్... లివింగ్... జీవితం... తంత్రం.. కుతంత్రం... మంత్రం... పుష్పమంత్రం... మంత్ర పుష్పం... పుష్పం? శష్పం... సుసరభేత్... కామ నిలయా ఘూటరోమాటవీ సముత్పాటనా పరిపాటికై పాటల గంధులు దీనిని పాటింతురు...".

ఫణిహారం వల్లభాచార్య ఈ నవలను మనస్తత్వశాస్త్రంతో ఎంతగానో విశ్లేషించవచ్చునీ, అస్తిత్వవాదంతో దీని లోతులకు ఈదుకుంటూ వెళ్ళవచ్చునీ, అయాన్ రాండ్ 'ద వర్చ్యూ ఆఫ్ సెల్ఫిష్నెస్' పుస్తకం మొత్తాన్నీ దీనికి అన్వయించవచ్చునీ అంటారు. కాశీభట్ల వేణుగోపాల్ 'తెరవని తలుపులు' నవలను సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం, ఎరిక్సన్ మనోసాంఘిక విశ్లేషణ సిద్ధాంతాలను పరిగణనలోకి తీసుకొని విశ్లేషించవచ్చు. ఈ నవలలోని కథానాయకుడు ఆధునిక జీవితం అందించిన సౌఖ్యాలు పొందిన బ్రాహ్మణుడు, తాగుబోతు, చైన్ స్మోకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. అతడి భార్య లెక్చరర్. కొడుకు అమెరికాలో చదువుకోవాలి అనుకొంటూ ఉంటాడు. ఆర్థికంగా స్థిరంగా ఉన్న ప్పటికీ కథానాయకుడి మానసిక జీవితం ఒంటరితనంతో, అస్తిత్వ శూన్యతతో నిండి ఉంది. స్మోకింగ్ వల్ల కాళ్ళు కోల్పోయే స్థితిలో, ఆపరేషన్కు ముందు నిద్రమాత్రలతో జీవితాన్ని ముగిస్తాడు. ఫ్రాయిడ్ నిర్వచించిన 'ఇడ్', 'ఈగో', 'సూపర్%–%ఈగో' భావనలను ఈ కథకు అన్వయించవచ్చు. నవలలోని కథానాయకుడి పాత్రలోని 'ఇడ్' సమాజం ఆమోదించని, అసంగతమైన కోరికలను జనింపజేస్తుంది. ఉదాహరణకు కథానాయకుడు తన కుటుంబ సభ్యుల గురించి ఇలా అనుకొంటాడు: "నేను విడిపోతే వీళ్ళకు దారి సుగమం అవుతుంది. అట్లా కావడం నాకు ఇష్టం లేదు. కలిసుండాలి. వాళ్ళని హింసించాలి. వాళ్ళు సుఖాలు అనుకొంటున్నవాటికి నేను అడ్డం పడాలి". తన కుటుంబం పట్ల అతని ఈ భావనలను సమాజం హర్షించదు. సమాజ ఆమోదం లేని ఇలాంటి అనేక ఆలోచనలు కథానాయకుడి మస్తిష్కంలోకి వస్తూంటాయి. అతని పాత్ర అంతరంగాన్ని 'ఇడ్' ఎంత డామినేట్ చేసినప్పటికీ కొన్ని విషయాల్లో 'ఈగో' ప్రభావంచేత అతడి ప్రవర్తన సమాజ ఆమోదయోగ్యంగా మారుతుంది. ఉదాహరణకు ఒకచోట కథానాయకుడు "ఆ పెద్దావిడ సంభాషణ ఎక్కడికి దారితీస్తుందో నాకు తెలుసు. మీ ముందు ఆమెను తిట్టలేను కదా... అందుకే... ఏం చెయ్యమంటావు నన్ను చెప్పు?" అంటాడు. తిట్టాలని ఉన్నా పెద్దావిడను అందరిముందు తిట్టడం తప్పు అనే ఆలోచనకు ఫ్రాయిడ్ ప్రకారం మనిషిలో ఉన్న ఈగో కారణం. ఇక ఆదర్శవంతమైన ప్రవర్తనకు కారణం 'సూపర్ ఈగో'. ఈ నవలలోని ప్రధాన కథానాయకుడి పాత్ర అనేక ఒత్తిడుల వల్ల తన నిజమైన ఆలోచనలను దాచుకోవడం చేత అవి 'తెరవని తలుపులు'గా మిగిలిపోతాయి.

మనిషి తన మానసిక సంఘర్షణలను అధిగమించడానికి పలురకాల రక్షకతంత్రాలను (డిఫెన్స్ మెకానిజమ్స్) అనుసరిస్తాడని ఫ్రాయిడ్ ప్రతిపాదిస్తారు. ఈ నవలలోని అనేక పాత్రలు ఈ తరహా రక్షక తంత్రాలను అనుసరిస్తూ ఉంటాయి. ఉదాహరణకు 'నిరాకరణం' (డినైయల్) అనే రక్షక తంత్రాన్ని కథానాయకుడు అనుసరించే సందర్భం మనకు నవలలో కనిపిస్తుంది. "నాకు ఏ రోగం లేదు. ఏదో రోగముందేమో అనుకొనే రోగం. హైపోకాండ్రియా అనే రోగం" అని కథానాయకుడు అంతరంగంలో అనుకొంటాడు. అలాగే నార్సిజమ్కు సంబంధించిన భావనలూ నవలలో ఉన్నాయి. కథానాయకుడు అంతరంగంలో, "మనుషులు ఎవరిని వారు ప్రేమించుకుంటారన్న భావన నాలో తీవ్రంగా ఉంది. నేనూ అంతే గదా! నన్ను నేను నార్సిస్టిక్గా ప్రేమించుకొంటాను" అనుకొంటాడు. ఎరిక్సన్ అనే మనోవిజ్ఞాన శాస్త్రవేత్త తన సాంఘిక మనోవికాస సిద్ధాంతంలో వ్యక్తి అహం ఎనిమిది సాంఘిక దశల ద్వారా పయనిస్తూ వికసిస్తుందని చెబుతారు. ఆ ఎనిమిది దశల్లో ఆరవ దశ అయిన 'సన్నిహితం %–% ఏకాంతం' అతిముఖ్యమైనది. ఈ దశలోని వ్యక్తులు ఏ కారణం చేతనైనా తమ ఆశలు, సిద్ధాంతాలు, ఆలోచనలను సరిగ్గా ఏర్పరచుకోలేక పోయినప్పుడు ఇతరులతో కలవలేక ఏకాంతంగా గడిపే ప్రయత్నం చేస్తారు.

# ఆశ్రమ పాఠశాలలో అల్పాహారం తిని 30 మంది విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత





గాయత్రి వార్తలు

ఖమ్మం జిల్లా కల్లూరు పట్టణంలో ఎన్ఎస్పి వద్దగల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉదయం అల్పాహారం కిచిడి తిని 30 మంది విద్యార్థినులకు వాంతులు, ఆయాసం,కడుపు ఉబ్బరం, తీవ్ర కడుపునొప్పి... ఆసుపత్రికి తరలింపు మూడో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకునే విద్యార్థినులు గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి తో పాటు విద్యను నేర్చుకుంటున్నారు ఈరోజు ఉదయం చేసిన అల్పాహారం కిచిడీని తిని వాంతులు విరోచనాలు కడుపు ఉబ్బరం తీవ్రమైన కడుపు నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురవడంతో సుమారు 30 మందికి పైగా విద్యార్థినులను అందుబాటులో ఉన్న ఏ.ఎం.సి చైర్మన్ ,లోకల్ నాయకుల వాహనాల్లో మరియు ఆటోల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించడంతో అక్కడికి అప్పుడే వచ్చిన పిహెచ్సి డాక్టర్ నవ్య కాంత్ మరియు కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్ డాక్టర్ రమేష్ లు ఎండిఓ ఎమ్మార్వో ల పర్యవేక్షణలో విద్యార్థినులకు చికిత్సను అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ అజయ్ యాదవ్ హాస్పిటల్ కు వచ్చి విద్యార్థినులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం అందడంతో హుటాహుటిన స్థానిక ఎమ్మెల్యే మట్టారాగమయి కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి ధైర్యం చెప్పి వైద్యులకు సూచనలు చేసి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చేరుకొని మిగతా విద్యార్థినులతో మాట్లాడి వండిన కూరలను ఆహార పదార్థాలను పరిశీలించి 89 మందికి వండాల్సిన పరిమాణం కంటే తక్కువగా వండుతున్నారని గ్రహించి నాసిరకంగా ఉన్న సాంబారు, మజ్జిగలను పరిశీలించి పూర్తిగా హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం కనబడుతుందని వివరిస్తూ వంట మనుషులను మందలించారు ఈ సంఘటనకు కారణమైన కారకులను గుర్తించి వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు అల్పాహారం చేసి తోటి విద్యార్థినులు అస్వస్థతకు గురవటంతో మధ్యాహ్న భోజనానికి చేయటానికి భయపడుతున్న విద్యార్థినులకు ధైర్యం కల్పించడం కోసం ఎండిఓ,ఎమ్మార్వో, డాక్టర్లు భోజనం చేసి విద్యార్థినులతో కూడా భోజనం చేయించారు

# అట్టహాసంగా నేచర్ 369 బిర్యానీ రెస్టారెంట్ ప్రారంభం

- ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ



గాయత్రి వార్తలు

గ్రేటర్ వరంగల్ 5వ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ సమీపంలోని చాపల మార్కెట్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన నేచర్ 369 బిర్యానీ రెస్టారెంట్‌ను సోమవారం స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ అట్టహాసంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, "నగర ప్రజలకు రుచి, శుద్ధత, నాణ్యత కలిగిన భోజనాన్ని అందించి ప్రజాదరణ పొందాలని నిర్వాహకులు కృషి చేయాలి" అన్నారు. అనంతరం ఆయన రెస్టారెంట్ నిర్వాహకులు ఐలాపురం వేణుచారి, కీర్తన దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. నిర్వాహకుడు వేణుచారి మాట్లాడుతూ, "మా బిర్యానీ తయారీలో సహజ పదార్థాలు మాత్రమే వాడుతాము. ఎలాంటి హానికర రసాయనాలు వాడకుండా ఆరోగ్యానికి హానికరం కాకుండా రుచికరంగా బిర్యానీని అందించడమే మా లక్ష్యం" అని అన్నారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ వరకు 'ఒక బిర్యానీ కొంటే ఒకటి ఉచితం' ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, చెన్నం మధు, బొంగు అశోక్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ మిర్యాల్కార్ దేవేందర్, 5వ డివిజన్ అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుత్తికొండ సురేందర్, వేమునూరు రాజలింగం, ఐలాపురం నితిన్ తదితర బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.

# దేశం గర్వించదగిన గిరిజన నేత, జారండ్ మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతి పట్ల ముఖ్యమంత్రి ఏ నుముల.రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం తెలియజేశారు.

గాయత్రి వార్తలు

జార?ండ్ ప్రత్యేక రాష్ట్ర సాధనలో, గిరిజన సమస్యల పరిష్కారంలో మడమ తిప్పని పోరాటం చేసిన యోధుడు గురూజీ శిబు సోరెన్ ని ముఖ్యమంత్రి కొనియాడారు.

వడ్డీ వ్యాపారుల ఆగడాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరులోనూ శిబు సోరెన్ గారు తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు శిబు సోరెన్ మొదటి నుంచి మద్దతుగా నిలిచారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి సైతం చివరి వరకు ఆయన బలమైన వాదన వినిపించారని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు.

ఆదివాసీ సమాజానికి గురూజీ చేసిన సేవలు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని ముఖ్యమంత్రి అన్నారు. 8 సార్లు లోక్‌సభ ఎంపీగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యునిగా, జార?ండ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. శిబు సోరెన్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుమారుడు, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గారు, కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



20

# ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి:

- సీఐటీయూ డిమాండ్



గాయత్రి వార్తలు

ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ, సీఐటీయూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ బషీర్ అహ్మద్ మాట్లాడుతూ, వరంగల్ జిల్లాలో సుమారు 25 వేల మంది ఆటో కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్యంతో వారు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో వృత్తిని ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న కార్మికులు చావలేక బ్రతకలేక జీవచ్ఛవంలా మారుతున్నారని, ప్రభుత్వం ప్రకటించిన రూ.12,000 సాయం అమలులోకి రాకపోవడం వల్ల వారికి ఉపాధి కరువైందని విమర్శించారు. ఆటో కార్మికులకు ఉపాధి భద్రత, జీవన భృతి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ముఖ్యమైన డిమాండ్లు:**

ఆటో కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలి.సంవత్సరానికి రూ.12,000 జీవన భృతి ఇవ్వాలి.ఇందిరమ్మ ఇండ్లలో ఆటో కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలి.ఉచిత లైసెన్స్, గుర్తింపు కార్డులు జారీ చేయాలి.50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.5000 పెన్షన్ కల్పించాలి.పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య అందించాలి.ఆటో అడ్డాల వద్ద నెలకు ఒకసారి ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించాలి.కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచిత డయాలసిస్, ఎక్స్‌రే, స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించాలి.ఆరోగ్య, జీవిత బీమా సౌకర్యాలు ఉచితంగా కల్పించాలి.ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించాలి.ఆర్టీఏ, పోలీసుల వేధింపులకు అడ్డుకట్ట వేయాలి. ఈ కార్యక్రమంలో మంద ప్రభాకర్, కౌడగాని రాజేశ్వరరావు, భోగం వెంకటేశ్వర్లు, కూరెల్లి కుమార్, జూపాక రాజు, మహమ్మద్ చాంద్ పాషా, కోడెపాక సదానందం తదితర నాయకులు పాల్గొన్నారు.

# వైద్యుడి కుటుంబానికి బీజేపీ నేత పరామర్శ

ఎలుకుర్తీలో డా. మార్త రమేష్ కుటుంబానికి డా. పగడాల కాళీ ప్రసాద్ సానుభూతి



గాయత్రి వార్తలు

ఎలుకుర్తీ గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డా. మార్త రమేష్ తండ్రి ఇటీవల మరణించగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర నాయకుడు, పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు గారు సోమవారం వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కష్ట సమయంలో పార్టీ తరఫున అన్ని విధాలా మద్దతుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గీసుగొండ మండల అధ్యక్షుడు చోక్కం శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి కొంగర రవికుమార్, ఉపాధ్యక్షుడు తుమ్మనపల్లి శంకర్ రావు, గట్ల భిక్షపతి, కోట్రా తిరుపతి, కోట శివ, జల్లెల శివ, జాన్ విక్రమ్, ఆకుల వెంకన్నా, అరకట్ల ప్రవీణ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుల వివక్ష..కూలి పనికి రాకుండా ఆపుతున్న గ్రామ పెద్దలు

- దళితులుగా పుట్టడమే మా తప్పా



గాయత్రి వార్తలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న అంబేద్కర్ నగర్ కాలనిలో ఉన్నటువంటి గూడ కుమారి అనే మహిళను ఆ ఊరికి చెందిన కొంతమంది పెద్ద మనుషులు తనను పనిలోకి రానివ్వకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని,ఆమెను కులంలో నుంచి వెలేసం,ఎవరన్నా గూడ కుమారి నీ మీతో పాటు పనికి తీసుకెళ్తే మీకు ఇబ్బంది తప్పదు అని హుకుం జారి చేశారనీ,నేను దళితులకు పుట్టడమే చేసిన తప్ప,సుమారు 6 నెలల నుంచి నా పై కక్ష కట్టి కూలి పనులకు వెళ్లకుండా నన్ను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారనీ,గ్రామంలో ఏమన్నా శుభకార్యాలు ఉన్నా కూడా మమ్ము ల్నీ పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, అధికారులకు చెప్పినా కూడా స్పందన లేదు,ఇంకెంత కాలం మమ్మల్ని ఇబ్బంది పెడతారు ఇకనైనా పై స్థాయి అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

# భార్య జ్ఞాపకార్థం విద్యార్థులకు ప్లేట్స్ వితరణ

- దాతల సహాయం అభినందనీయం
- ఉపాధ్యాయులు గొల్లమందల వెంకటయ్య



గాయత్రి వార్తలు

మండల పరిధిలో చంద్రుపట్ల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గొల్లమందల వెంకటయ్య మాట్లాడుతూ దాతల సహాయము అభినందనీయమని అన్నారు. మోదుగు వెంకటరమణ జ్ఞాపకార్థంగా వారి భర్త మోదుగు గోవిందరావు మా పాఠశాల పిల్లలకు 50 మందికి ప్లేట్లు, గ్లాసులు ఇవ్వడం చాలా గొప్ప విషయమని అన్నారు. పాఠశాలలో పిల్లలకు అవసరమైన ప్రతి విషయంలో కూడా గ్రామములో ఉన్న ప్రతి ఒక్కరు స్పందించి సహాయ సహకా అందించాలని వారు కోరారు.అదే విధంగా గ్రామములో ఉన్న రెండు అంగన్వాడి సెంటర్లకు 50 ప్లేట్లు గ్లాసులు అందజేశారు.సుమారు 100 మంది చిన్నారులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ చేయడం సంతోషమని పలువురు గ్రామ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిగడుపు వెంకటేశ్వర్లు, ఇనపనూరి ముత్తయ్య, మాజీ వార్డు సభ్యులు ఇనుపనూరి జమలయ్య, మేస్త్రి పరిగడపు వెంకటేశ్వర్లు,గంధం చిరంజీవి, పరిగడుపు బాబు, పరిగడుపు మహేష్ ,వెంకటకృష్ణ, కాంపాటి కృష్ణ తరితరులు పాల్గొన్నారు.




# కూలీలో సైమన్ పాత్రలో ఒదిగిపోయిన నాగ్

## ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీ ప్రశంసలు



'కూలీ' కథ చెప్పగానే అందులో సైమన్ పాత్ర తాను చేయాలన్నంత ఆసక్తి కలిగిందని దాన్ని నాగార్జున లాంటి నటుడు పోషించి అదరగొట్టారని అగ్ర కథానాయకుడు రజనీకాంత్ అన్నారు. ఆయన కీలక పాత్రలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కూలీ' ఆగస్టు 14న విడుదల కానుంది. ఈసందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ స్పెషల్ వీడియోతో తెలుగు వారిని పలకరించారు. తెలుగు సినీ ప్రేక్షకులకు నా నమస్కారం. నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు. ఈ సంవత్సరంలో లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నేను నటించిన 'కూలీ' ఆగస్టు 14న రావడం సంతోషంగా ఉంది. తెలుగులో రాజమౌళి ఎలాగో తమిళంలో లోకేశ్ కనగరాజ్ అలా. ఆయన చేసిన సినిమాలన్నీ హిట్. ఇంకొక గొప్ప విషయం ఏంటంటే, ఇందులో పలువురు స్టార్స్ నటించారు. చాలాఏళ్ల తర్వాత సత్యరాజ్‌తో చేస్తున్నా. ఇక శ్రుతిహాసన్, ఉపేంద్ర, సౌబిన్‌లతో పాటు- ఆమిర్‌ఖాన్ స్పెషల్ అపియరెన్స్ ఉంది. ముఖ్యంగా నాగార్జున ఇందులో విలన్‌గా చేస్తున్నారు. అసలు 'కూలీ' సబ్జెక్ట్ విన్న వింటనే సైమన్ పాత్ర నేనే చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆ పాత్ర ఎవరు చేస్తారా? అని ఎదురుచూశా. ఎందుకంటే చాలా స్టైలిష్‌గా ఉంటుంది. ఆర్నెళ్ల పాటు వెతికాం.ఈ పాత్ర గురించి ఒక నటుడితో ఆరుసార్లు సిటింగ్ అయింది. అయినా ఓకే అవలేదు' అని లోకేశ్ నాతో అన్నారు. 'ఎవరు ఆయన' అని నేను అడిగా. నాగార్జున పేరు చెప్పగానే ఆశ్చర్యపోయా. ఆ తర్వాత ఆయన ఒప్పుకొన్నారని తెలిసి సంతోషంగా అనిపించింది. ఎందుకంటే, డబ్బు కోసం సినిమాలు చేసే వ్యక్తి కాదు. ఆయనకు ఆ అవసరం లేదు. మేమిద్దరం 33 ఏళ్ల కిందట ఒక సినిమా చేశాం. అప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. నాకు జుట్టు కూడా ఊడిపోయింది. నాగార్జునతో పని చేస్తుండగా 'మీ ఆరోగ్య రహస్యం ఏంటి' అని అడిగాను. 'ఏమీ లేదు సర్.. వ్యాయామం, ఈత, కొద్దిగా డైట్. సాయంత్రం 6 గంటలకు డిన్నర్ అయిపోతుంది. మా తండ్రి నుంచి వచ్చిన జీన్స్ కూడా ఒక కారణం. దాంతో పాటు, నా తండ్రి నాకో సలహా ఇచ్చారు. 'బయట విషయాలు




తలలోకి ఎక్కించుకోవద్దని చెప్పారు' అని నాగార్జున నాతో చెప్పారు. 17 రోజుల షెడ్యూల్ కోసం ఇద్దరం థాయ్‌లాండ్ వెళ్లాం. అది నా జీవితంలో మర్చిపోను. సైమన్ పాత్రలో ఆయన నటన చూస్తుంటే, నాకే ఆశ్చర్యమేసింది. బాషా- ఆంటోనీ ఎలాగో.. కూలీ-సైమన్ అలా ఉంటుంది. ఇక ఇందులో అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందరినీ ఆకట్టు-కుంటుందని రజనీకాంత్ అన్నారు.

# ఎన్టీఆర్ డ్యాన్స్ అదుర్స్

## వార్-2 ప్రచారంలో హృత్రిక్ రోషన్

ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం 'వార్ 2' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా వీరిద్దరూ వరుస పోస్టులతో ఆడియన్స్‌లో జోష్ పెంచారు. ఈ సినిమాలో ఎన్టీఆర్, హృతిక్ పోటాపోటీగా తలపడనున్న విషయం తెలిసిందే. ఇప్పుడు సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ విషయంలోనూ ఈ ఇద్దరూ పోటీపడ్డారు. మాటల యుద్ధం ప్రారంభించారు. ప్రచారంలో భాగంగా హృతిక్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఎన్టీఆర్ డ్యాన్స్‌పై ప్రశంసలు కురిపించారు. 'నేను ఇప్పటివరకూ వర్క్ చేసిన సహనటుల్లో రిహార్సల్స్ అవసరం లేని ఒకేఒక్క హీరో ఎన్టీఆర్. ఎంత కష్టమైన మూమెంట్ అయినా ఆయన ప్రత్యేకంగా రిహార్సల్స్ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రతి స్టెప్ ఆయనకి సులభమే. ఈ సినిమా షూటింగ్ సమయంలో తన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను' అని తెలిపారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా 'వార్ 2' రూపొందింది. కియారా అద్వాణీ కథానాయికగా కనిపించనున్నారు. మొదట ఈ సినిమా గురించి పోస్ట్ పెట్టిన హృతిక్. 'వార్ మొదలైంది. ఒక హ్యాష్‌ట్యాగ్ ఈ యుద్ధం గురించి మీకు చెబుతుంది. ఈ ట్యాగ్‌తోనే నేను ప్రత్యేకమైన సమాచారాన్ని పంచుకుంటాను' అని తెలిపారు. దీనిపై స్పందించిన ఎన్టీఆర్.. 'అప్‌డేట్స్, ప్రత్యేక విశేషాలు పంచుకుంటారా..!అనేది ఉపయోగించాలని మనం ముందే మాట్లాడుకున్నాం కదా. ఎందుకంటే అసలు యుద్ధం ప్రారంభమయ్యేది ఈవిధంగానే కాబట్టి ఈ హ్యాష్ ట్యాగ్‌నే వాడాలి' అంటూ రాసుకొచ్చారు. నేను చెప్పేది బాగుందని మీరు అన్నారు అంటే నేను గెలిచేసినట్లే.. హృతిక్ సర్' అంటూ ఎన్టీఆర్ ఓ ఎమోజీని పోస్ట్ చేశారు. వీరి పోస్ట్‌లు చూసినవారంతా సినిమా -టైటిల్‌కు తగినట్లుగానే వార్ చేసుకుంటున్నారని కామెంట్స్ చేస్తున్నారు. ఇద్దరు వారియర్స్ చేసుకున్న యుద్ధం మరో 10 రోజుల్లో మీ ముందుకురానుందని ఎన్టీఆర్ తెలిపారు.




# జటాధర ఫస్ట్ లుక్ అదుర్స్

సుధీర్ బాబు హీరోగా ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రం 'జటాధర'. వెంకట్ కళ్యాణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా లో సుధీర్ బాబుతోపాటు బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్, రవి ప్రకాష్, ఇంద్ర కృష్ణ, నవీన్ నేని, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ నటిస్తున్నారు. జటాధర చిత్రాన్ని ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ నిర్మిస్తుండగా.. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేయగా. ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ ఇచ్చేందుకు చిత్ర యూనిట్ రెడీ అయ్యింది. 'జటాధర' మూవీకి సంబంధించిన టీ-జర్ ను ఆగస్టు 8న విడుదల చేయబోతున్నట్లు- అధికారంకంగా ప్రకటించారు . అలాగే ఓ పవర్ ఫుల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ప్రజంట్ ఈ న్యూస్ వైరల్ అవుతుండడంతో సుధీర్ బాబు అభిమానులు ఫుల్ ఖుష్ అవుతున్నారు.

# టాలివుడ్ కార్మిక సంఘాల సమ్మె

## ఉస్తాద్ భగత్‌సంగ్ షూటింగ్‌కు అంతరాయం




టాలీవుడ్ కార్మిక సంఘాలు సమ్మె సైరన్ మోగించాయి. రోజు వారి వేతనాలు 30శాతం వరకు పెంచమనడంతో అందుకు ఫిలిం ఛాంబర్ ఒప్పుకోకపోవడంతో సోమవారం నుండి ఫిలిం ఫెడరేషన్ సంఘాలు షూటింగ్స్ చేయకుండా బంద్‌కు పిలుపునిచ్చాయి. దాంతో టాలీవుడ్ లో మీడియం చిన్న సినిమాల షూటింగ్స్ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కానీ బడా నిర్మాణా సంస్థలు మాత్రమే షూటింగ్స్ ను ఆపేది లేదని ఎవరిని లెక్క చేయకుండా షూటింగ్స్ చేస్తున్నాయి. టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థలో ఒక-టైన మైత్రీ మూవీస్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ డైరెక్షన్ లో ఉస్తాద్ భగత్ సింగ్ చేస్తోంది. సీనియర్ నటీనటుల కాంబినేషన్ లో సీన్స్ ఉండడంతో షూటింగ్ ఆపితే ఎక్కువ నష్టం వస్తుందని భావించి షూటింగ్ చేస్తోంది. వేతనాలు పెంపు కొరకు తెలుగు సినిమా కార్మికులు నేటి నుంచి బంద్ కు పిలుపునివ్వడంతో చేసేదేమి లేక ముంబయి నుండి కార్మికులను తెప్పించి మరి షూటింగ్ నిర్వహిస్తోంది మైత్రి సంస్థ. అన్నపూర్ణ స్టూడియో లో ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ జరుగుతోంది. ముంబై నుండి కార్మికులు వచ్చారని తెలుసుకున్న యూనియన్ ప్రతినిధులు పవన్ కళ్యాణ్ షూటింగ్ ను అడ్డుకోవడానికి వెళ్లాయి. దానితో అక్కడ ఇరువురి మధ్య వాదనలు చెలరేగాయి. కార్మికులు ఒక వైపు బంద్ చేస్తుంటే ముంబయి నుండి వర్కర్స్ ను ఎలా తీసుకువస్తారు, మన కార్మికులు కష్టం హీరో పవన్ కళ్యాణ్ గారికి తెలియదా అని పవన్ కళ్యాణ్, మైత్రి సంస్థ పై మండి పడుతున్నాయి సినీ కార్మిక సంఘాలు.



# సైయారా విజయం అద్భుతం

ప్రేక్షకులు ఎలాంటి సినిమాలకు ఎలా రియాక్ట్ అవుతున్నారో చెప్పడం కష్టతరంగా మారింది. వంద కోట్ల బడ్జెట్‌తో వచ్చిన సినిమాలను కనీసం పటించుకోవడంలేదు.. ఊహించని విధంగా చిన్న సినిమాలను మాత్రం ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇందుకు నిదర్శనం 'సైయారా'. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.400 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. దీంతో ఈ చిత్ర దర్శకుడు మోహిత్ సూరి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నా 17ఏళ్ల వయస్సులో మొదటిసారి సెట్‌లో అడుగుపెట్టాను. అలా ఐదేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి 22 ఏళ్లకు దర్శకత్వం ప్రారంభించాను. ఇప్పుడు నా వయసు 44 ఏళ్లు. సగం జీవితం సినిమా సెట్‌లలోనే గడిచిపోయింది. అదేంటో తెలీదు కానీ ఆ వాతావరణంలో నేను నాకు నచ్చినట్లు- ఉండగలను. సామాజిక కార్యక్రమాల్లో, ఈవెంట్‌లలో నేను మాములుగా ఉండాలని ప్రయత్నించినా ఇబ్బందిగానే ఉంటుంది. అలాంటి ప్రదేశాల్లో కేవలం దర్శకుడిగా మాత్రమే ఉంటాను. సెట్‌లో మాత్రం అలా కాదు నాకు అక్కడ ఉన్నంత సౌకర్యంగా మరెక్కడా ఉండలేను. జీవితమంతా ఇలానే గడిచిపోవాలని కోరుకుంటున్నాను. నిజజీవితంలో కంటే సెట్‌లోనే స్నేహితులను దక్కించుకున్నాను అని మోహిత్ సూరి తెలిపారు.

# మొటిమలు పోవాలంటే.. తమన్నా చెప్పిన చిట్కా ఇదే!

'అందమైన ప్రేమరాణి లేత బుగ్గపై.. చిన్న మొటిమ కూడా ముత్యమేలే..' అని ఓ సినీ కవి గొప్పగా రాశారు. అయినప్పటికీ కేవలం మిల్లీమీటర్ ఉండే పింపుల్..! మన మనసంతా భారంగా మారుస్తుంది. ఆ మొటిమల వల్ల తమ అందం తరిగిపోతుందని ముఖ్యంగా యువత ఉక్కిరిబిక్కిరవుతుంది. అవి తగ్గడం కోసం వంటింటి చిట్కాలు, డెర్మటాలజిస్టు అపాయింట్‌మెంట్లు, క్రీములు, సబ్బులు... ఇలా అన్ని విధాలా ప్రయత్నిస్తుంటారు. అయితే ఇలాంటి వారికోసం మిల్క్ బ్యూటీ తమన్నా భాటియా ఓ సహజ సిద్ధమైన చిట్కా గురించి ఇటీవల ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. అయితే అది కాస్త అసాధారణంగా ఉండటంతో చర్చనీయంగా మారింది. ఆమె ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చర్మ సౌందర్యం గురించి మాట్లాడారు. మొటిమలకు ఉదయపు ఉమ్మి.. అద్భుతంగా పనిచేస్తుందన్నారు. 'ఉమ్మితో మొటిమలను నివారించుకోవచ్చు. అంటే.. ముఖ్యంగా ఉదయాన వచ్చే ఉమ్మితో పింపుల్స్ సమస్య నుంచి ఎంచక్కా బయటపడొచ్చు' అని చెప్పారు. అలాగే దీని వెనక ఓ సైంటిఫిక్ రీజన్ కూడా ఉందంటూ వివరించారు.'దీని వెనక సైన్స్ ఉంది. ఎలా అంటే.. మనం ఉదయం నిద్ర లేవగానే మన నోట్లోని సలైవా(ఉమ్మి)లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అవి మొటిమలతో పోరాడతాయి. అయితే నేను డాక్టర్‌ని కాదు. కానీ ఇది నా పర్సనల్ చిట్కా. మొటిమల విషయంలో ఇది వర్కౌట్ అవుతుందని నేను నమ్ముతున్నా. మనం నిద్రలేచేటప్పటికే మన శరీరం చాలా యాంటీ బ్యాక్టీరియల్ ఎలిమెంట్స్‌ను నోట్లో తయారు చేసుకుంటుంది. మేల్కొన్న తర్వాత మన కంట్లో, ముక్కులోనూ మ్యూకస్ ఉంటుంది. అలాగే అప్పటికింకా మనం బ్రష్ చేసి ఉండం కాబట్టి.. మన నోరు చాలా రకాలైన బ్యాక్టీరియాతో యుద్ధం చేసి ఉంటుంది. మనం గనక ఆ ఉదయపు ఉమ్మిని మొటిమ మీద రాస్తే.. అది వెంటనే మానిపోయేలా చేస్తుంది' అని ఆమె వివరించారు. అలాగే ఇతర చర్మ సంరక్షణ విధానాల గురించి కూడా ఆమె కొన్ని సూచనలు చేశారు. 'నేను 24, 25 ఏళ్ల వయసు నుంచే చర్మ సంరక్షణ కోసం శ్రద్ధ తీసుకుంటున్నాను. అలాగే వృద్ధాప్య ఛాయలను తగ్గించుకోవాలనుకుంటే.. 25 సంవత్సరాల వయసు నుంచే యాంటీ ఏజింగ్ క్రీమ్‌లను ఉపయోగించడం మంచిది. ఆ ఏజ్ నుంచే ఇలా చేస్తే.. తప్పకుండా ఫలితం కనిపిస్తుంది' అని ఆమె తన అభిమానులకు సలహా ఇచ్చారు. తమన్నా.. టాలీవుడ్‌లో ఇటీవల 'ఓదెల 2'లో అఘోరీ పాత్రలో తన నటనతో మెప్పించారు. అలాగే బాలీవుడ్‌లో 'రైడ్ 2'లో 'నషా' అనే సాంగ్‌లో తళుక్కున మెరిశారు.

